సంతలో పండుగ సందడి

ఆమనగల్లు: విజయదశమిని పురస్కరించుకుని క్రయవిక్రయదారులతో దుకాణ సముదాయాలు కిటకిటలాడాయి. వాహనాల రాకపోకలతో రహదారుల్లో రద్దీ నెలకొంది. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం సంతలో కొనుగోలు దారులతో సందడిగా మారగా.. ప్రయాణికులతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హైదరాబాద్- శ్రీశైలం హైవేపై వాహనాలు క్యూకట్టాయి.



ఇబ్రహీంపట్నం: మహిషాసురమర్దిని అలంకరణలో రాజరాజేశ్వరి



యాచారం: నందివనపర్తిలో..



ఆమనగల్లు: దుర్గామాత సన్నిధిలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



కడ్తాల్: మైసిగండిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కడ్తాల్: మైసిగండిలో మహిషాసురమర్దినిగా అన్నపూర్ణేశ్వరి



ఆమనగల్లు: మహిషాసురమర్దినిగా కన్యకా పరమేశ్వరి

జయజయహే మహిషాసుర మర్దిని

- ముగిసిన దేవీ శరన్నవరాత్రోత్సవాలు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తజనం
- నేడు విజయదశమి

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/కడ్తాల్/యాచారం: దేవీ శరన్నవరాత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు నవరాత్రులు ఘనంగా జరిగాయి. పదోరోజు శనివారం విజయదశమి(దసరా) పండుగను జరుపుకోవడానికి ప్రజలు సమాయత్తమయ్యారు. ఎనిమిది రోజుల్లో రోజుకో రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వగా.. తొమ్మిదో రోజైన శుక్రవారం మహిషాసుర మర్దినిదేవిగా అనుగ్రహించింది. వేడుకల్లో భాగంగా పట్నంలోని ఈశ్వరాంజనేయ ఆలయంలో రాజరాజేశ్వరిమాత, ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి, భక్తమార్కండేయస్వామి గుడిలో రాజరాజేశ్వరిదేవి, కడ్తాల్ మైసిగండి, శివరామాలయంలో అన్నపూర్ణేశ్వరి, యాచారం నందివనపర్తిలో జ్ఞాన సరస్వతి.. మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, హోమాలు చేశారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామ పంచాయతీ ఎల్లమ్మతండా కాలనీ, పదుశ్రీ కాలనీల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో నిత్యం వోల్టేజి సమస్య తలెత్తుండటంతో స్థానిక నాయకులు, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఏఈ నరేందర్ శుక్రవారం కాలనీల్లో పర్యటించి, సమస్య తెలుసుకున్నారు. పీసీసీ సభ్యుడితో కలిసి 25 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. లో వోల్టేజి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, కిషన్‌నాయక్, గోపాల్‌నాయక్, రాజునాయక్, హర్యానాయక్, నరేశ్, వెంకటయ్య, బాష నాయక్ తదితరులు ఉన్నారు.

జేసీబీని అడ్డుకున్న రైతుల అరెస్టు

కొందుర్గు: ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయనున్న పొలం తమదని జేసీబీలను అడ్డుకోబోయిన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొందుర్గు శివారు సర్వే నంబర్ 109లో పాఠశాల భవన నిర్మాణం కోసం అధికారులు రెండు రోజులుగా స్థలాన్ని చదును చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ చేయనుండగా.. ఈ సర్వే నంబర్‌లో తమకు 11 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని కొందుర్గుకు చెందిన రైతులు సున్నాల శ్రీనివాసు, సున్నాల నర్సింహులు, సున్నాల చిన్న రాములు, సున్నాల రామచంద్రయ్య ఉదయం జేసీబీలను అడ్డుకోబోయారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారిని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బాధిత రైతులకు అండగా ఉంటామని, ప్రభుత్వ నియంతృత్వాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులతో బీఆర్ఎస్ నాయకులు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి పోల్కంపల్లి గ్రామానికి చెందిన 9 మందికి రూ.3.73 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ రూ.5 లక్షలు ఉంటే.. రూ.10 లక్షలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెంచారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, త్వరలోనే మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో పట్నంను మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మయ్య, రవి నాయి‌బ్రహ్మాణ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, శివ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆమనగల్లు: మండల పరిధి పోలెపల్లి గ్రామంలో శుక్రవారం పోలెపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన క్రికెట్ కిట్‌ను అందజేశారు.

కుర్మిద్దలో దుర్గమ్మకు బోనాలు



బోనాలతో మహిళలు

యాచారం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కుర్మిద్ద గ్రామంలో మహిళలు కనక దుర్గమ్మకు బోనాలు చేశారు. నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి వెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

తలకొండపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. మండల పరిధి చీపునుంతల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దర్గమాతా మండపంలో ఆయన శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా దేవుని పడకల్‌ల్లో భక్తులు దుర్గమ్మను దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాసురెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నరోత్తంరెడ్డి, బాల కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.